TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :16 | పేజీలు 8 వెల : 5 | మంగళవారం 29 సెప్టెంబర్ 2026

టీజీపీఎస్సీ సర్ప్రైజ్ ధమాకా.. ఎగ్జామ్ డేట్స్ వచ్చేసినయ్..!

## బీసీ సంక్షేమానికి పెద్దపీట

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

స్కాలర్‌షిప్‌లు, రక్షణ కవచాల పంపిణీ

నవంబర్‌లో రాజీవ్ యువ వికాసం

ఓవర్సీస్ దరఖాస్తులకు గడువు పెంపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :** రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష (మిగతా 2వ పేజీలో)

## ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య బలం

అభివృద్ధి నైపుణ్యాలపై విస్తృత చర్చ

దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ఆందోళన

**ఓటర్ల జాబితా సవరణపై సీఎం రేవంత్ రెడ్డి**

**అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలని సూచన**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. అసోం దినపత్రిక 'ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్' ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'ది కాన్‌క్లేవ్-2026' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై మాట్లాడుతూ దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్య తగ్గడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉండాలని అన్నారు. ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా ఎన్నికల ప్రక్రియ సాగాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై జరిగిన చర్చలో దేశ భవిష్యత్ దిశ, విద్యా రంగ సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, (మిగతా 2వ పేజీలో)

## కేటీఆర్ ఖతర్నాక్ సవాల్..

**ఎయిర్‌పోర్ట్‌లా 5వేల ఎకరాలు పడిఉంటే.. !**

**హైదరాబాద్, సెప్టెంబర్ 28:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 5 వేల ఎకరాల జాగా ఖాళీగా ఉంటే.. బహదూర్ గూడా పేదల జాగాలను గుంజుకునే కుట్ర ఏంది అని కేటీఆర్ ఫైర్ అయిండు.. మేము బుల్లెట్ ట్రైన్‌కి వ్యతిరేకం కాదు, కానీ బుల్లెట్ ట్రైన్ పేరుతో భూముల దందా చేస్తే బాజాప్తా ఊరుకోం అని తెలంగాణ భవన్‌లో రైతుల పంచాయితీలా వార్నింగ్ ఇచ్చిండు. పోలీసులు రైతుల ఫోటోలు తీస్తే..ఆ పోలీసుల ఫోటోలే తీసి కేసీఆర్ సార్‌కి పంపాలని రైతులకు ఐడియా ఇచ్చిండు. కాంగ్రెస్ మాటల సైడ్.. బహదూర్ గూడా రైతుల ఫైట్ పైన కేటీఆర్ ఫుల్ సపోర్ట్ ఖాయం..

## మహిళా సంఘాలకు ఆర్థిక బలం

**ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం**

**బాగ్ లింగంపల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని స్వయం ఉపాధి రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే గుడ్ల విక్రయ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. మహిళా సంఘాలకు రూ. 1.20 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను అందజేయడంతో పాటు విద్యార్థులకు పాఠశాల దుస్తులను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక (మిగతా 2వ పేజీలో)

## సౌర విద్యుత్ వినియోగానికి ప్రోత్సాహం

**జగ్గన్నపేటలో సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభం**

**గ్రామ సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన మంత్రి**

ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్లాంట్లను రాష్ట్ర మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. రెండు గృహాలపై ఒక్కొక్కటి 2 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ సౌర విద్యుత్ వ్యవస్థలను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని మంత్రి తెలిపారు.

**ములుగు, సెప్టెంబర్ 28 :** గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. సౌర విద్యుత్ వినియోగం పెరగడం ద్వారా భవిష్యత్తులో విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన శ్రీ సీతారాముల గ్రామ సమాఖ్య (మిగతా 2వ పేజీలో)

## బతుకమ్మతో బంగారు అవకాశం

**ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రత్యేక ఆహ్వానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :** యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం హైదరాబాద్ లోని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాల యంలో నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు (మిగతా 2వ పేజీలో)

## యూపీఐ రుసుములపై నోటీసులు

**2 వేలకుపైగా వ్యాపార లావాదేవీలపై కొత్త రుసుముల వ్యవహారం**

**కేంద్రం, రిజర్వు బ్యాంకు, జాతీయ చెల్లింపుల సంస్థకు నోటీసులు**

**నాలుగు వారాల్లో సమాధానాలు దాఖలు చేయాలని ఆదేశం**

యూపీఐ చెల్లింపులపై కొత్త రుసుముల వ్యవహారం దేశ అత్యున్నత న్యాయస్థానం ముందుకు చేరింది. రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 : ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు, జాతీయ చెల్లింపుల సంస్థలకు నోటీసులు జారీ చేస్తూ తమ అభిప్రాయాలను సమర్పించాలని ఆదేశించింది. అయితే కొత్త విధానం అమలును తాత్కాలికంగా నిలిపివేయాలన్న అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ప్రధాన (మిగతా 2వ పేజీలో)

స్పందన తెలుగు దినపత్రిక

# నేటి రాశి ఫలాలు

మేషం: వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు వింటారు. రాజకీయ వర్గాల వారి నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి. వ్యాపార ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

మిధునం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు పెరుగుతాయి. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆస్తి వ్యవహారంలో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

కర్కాటకం: భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి. అధికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు సానుకూలమవుతాయి.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఇతరులపై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కన్య: చిన్ననాటి విషయాలు గుర్తుకువస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

తుల: ఆధ్యాత్మక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ విభేదాలు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవిలు నిరుత్సాహపరుస్తాయి. శ్రమతో కానీ కొన్ని పనులు పూర్తి కావు.

వృశ్చికం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. దాయాదులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

ధనస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక సంతోషాన్నిస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత మెరుగ్గా ఉంటాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

మకరం: ముఖ్యమైన పనులు మందగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కుంభం: ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఇంటా బయట కొందరు మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

మీనం: ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు అధికమవుతాయి.

# యూపీఐ రుసుములపై నోటీసులు: సుప్రీం

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది కొత్త రుసుముల అమలుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా, ఈ అంశం పూర్తిగా సాంకేతిక, ఆర్థిక విధానాలకు సంబంధించినదని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల ప్రస్తుతం జోక్యం చేసుకోవడం సముచితం కాదని పేర్కొంటూ స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి అమలులోకి రానున్న కొత్త విధానం ప్రకారం రూ.2 వేలకుపైగా విలువైన కొన్ని వ్యాపార యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ వర్తించనుంది.

దాదాపు ఆరు సంవత్సరాలుగా యూపీఐ లావాదేవీలు ఎలాంటి అదనపు రుసుములు లేకుండా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులు, చిన్న మొత్తాల లావాదేవీలు ఈ రుసుముల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ మాట్లాడుతూ, ఈ విధానం వల్ల యూపీఐ వినియోగదారులో 96 శాతం మందికి ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు వివరించారు. ఎక్కువ మొత్తాల వ్యాపార చెల్లింపులకే ఈ రుసుము వర్తిస్తుందని తెలిపారు. కొన్ని రంగాలకు ప్రత్యేక రాయితీలు, గరిష్ఠ రుసుముల పరిమితులు కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. రైల్వేలు, దూరసంప్రేషణ, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి తక్కువ లాభాలతో నడిచే రంగాలకు ప్రత్యేక విధానం అమలు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ రంగాల్లో రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలకు స్థిర రుసుము విధించనున్నారు. అలాగే పెట్టుబడి నిధులు, షేర్ల వ్యాపారానికి సంబంధించిన చెల్లింపులపై చాలా తక్కువ శాతం రుసుము మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు, జాతీయ చెల్లింపుల సంస్థ నాలుగు వారాల్లో తమ కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలో కొత్త విధానానికి సంబంధించిన ఆర్థిక, సాంకేతిక అంశాలపై సమగ్ర చర్చ జరిగే అవకాశం ఉంది. యూపీఐ వినియోగదారులు, వ్యాపార వర్గాలు ఈ కేసు పరిణామాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# బీసీ సంక్షేమానికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450 కోట్ల నిధులను నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. హాస్టల్ విద్యార్థుల ఆహార, ఇతర భత్యాలను కూడా ప్రతి నెలా సకాలంలో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న "కాటమయ్య రక్షణ కవచాలు" పథకం కింద 50 వేల మందికి రక్షణ కిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 40 వేల కిట్లను పంపిణీ చేశామని, శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూపొందించిన "రాజీవ్ యువ వికాసం" పథకాన్ని నవంబర్ నెల నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించినట్లు తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాల నిర్మాణంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 180 మంది విద్యార్థులకు ఇప్పటికే రూ.18.40 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మరింత మంది అర్హులకు అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల గడువులను అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అలాగే బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా త్వరలో విడుదల చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# సౌర విద్యుత్ వినియోగానికి ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

భవనాన్ని మంత్రి ప్రారంభించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి చెందిన రూ.10 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. గ్రామ మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సామాజిక కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. గ్రామీణ మహిళల సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతున్నామని తెలిపారు. గ్రామ సమాఖ్య భవనాలు మహిళల స్వయం ఉపాధి, శిక్షణ కార్యక్రమాలకు కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమవుతోందన్నారు. తాగునీరు, రహదారులు, సామాజిక భవనాలు, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో అనేక పనులు చేపడుతున్నట్లు వివరించారు. సుస్థిర అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన వినియోగం, మహిళా సాధికారత, గ్రామీణ మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య బలం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజన, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి విస్తృతంగా మాట్లాడారు. దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత మద్దతు అవసరమని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులు వేగంగా అమలు కావాలంటే కేంద్ర సహకారం అవసరమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశాలు కల్పించాలని కోరారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై స్పందిస్తూ జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు

రాజకీయంగా నష్టం కలగకూడదని పేర్కొన్నారు. లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో ఆ రాష్ట్రాల వాదన బలహీనపడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.

జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా తెలంగాణను దేశ అభివృద్ధిలో కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మాధ్యమం, నర్సరీ విద్య ప్రవేశపెట్టడం, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సంభాషణ సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్ ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం కృషి చేస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# రాహుల్ హెచ్చరికలే నిజమయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

మేరకు హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ వద్ద రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ నిరసన ద్వారా ప్రజలకు అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, ఓటర్ల హక్కులను రక్షించే చర్యలు చేపట్టాలని ఆ వినతిపత్రంలో కోరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేలా చర్యలు అవసరమని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల ప్రక్రియే మూలస్తంభమని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క, దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ మొదటి నుంచీ నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితాల అంశంపై ఆయన లేవనెత్తిన సందేహాలను ఇప్పుడు మరింత గంభీరంగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమైన ఓటు హక్కు విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసించే అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై కలిసికట్టుగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి సామూహిక కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రతి పౌరుడికి వారి ఓటు హక్కు పూర్తిస్థాయిలో అందే వరకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టేందుకు పారదర్శక వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.

# మహిళా సంఘాలకు ఆర్థిక బలం

(మొదటి పేజీ తరువాయి)

సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తూ వారికి స్థిరమైన ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. నగరాల్లో కష్టపడి జీవనం సాగించే పేద, సామాన్య ప్రజలకు కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాల పరిమితిని ఐదు లక్షల రూపాయల నుంచి పది లక్షల రూపాయలకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు. గత మూడు సంవత్సరాలుగా ఈ రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మహిళలు చిన్న స్థాయి వ్యాపారాల నుంచి పెద్ద స్థాయి ఉపాధి కార్యక్రమాల వరకు విస్తరించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్ల నిర్వహణతో పాటు సౌర విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర ఉపాధి కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సుల యాజమాన్య బాధ్యతలు అప్పగిస్తూ ఇప్పటికే వందలాది మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకువచ్చామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలకు ఇలాంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. బీసీ, మైనారిటీ మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నాణ్యమైన కుట్టు యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు.

# బతుకమ్మతో బంగారు అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ సృష్టికర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు, వివిధ విభాగాలు, పాల్గొనే అవకాశాలపై సమగ్రంగా వివరించారు. యువ సినీ సృష్టికర్తలు, డిజిటల్ కంటెంట్ తయారీదారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతను ఆధునిక సాంకేతిక వేదికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్ల పాత్ర ఎంతో కీలకమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజాపాలన కార్యక్రమాలపై అవగాహన కల్పించే విధంగా సృజనాత్మక దృశ్య కథనాలను రూపొందించాలని సూచించారు.

# పేదలకు సంజీవని సీఎం సహాయనిధి - మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్..

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన నీలం..

**పాటన్ చెరు, సెప్టెంబర్ 28, (స్పందన):**

కష్టకాలంలో పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఒక సంజీవనిలా మారిందని, పేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కానుకుంటకి చెందిన కుమ్మరి రామదాసు కు అరవై వేలు, ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన అడపా ఎల్లమ్మకు అరవై వేలు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.... ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. సరైన సమయంలో వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, మన్నే రాఘవేంద్ర, నారాయణదాసు, మణికంఠ, సర్పంచ్ కొరివి సురష్, మాజీ ఉప సర్పంచ్ శోభకృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాస్, వీరేష్, నర్సింలు, రాము, వెంకటేష్, బిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేస్తా

**జహీరాబాద్: సెప్టెంబరు 28:**

ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతనంగా నియమితులైన జాతీయ ఉపాధ్యక్షుడు మ్యాతారి ప్రవీణ్ తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రవీణ్‌ను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, న్యాయ సలహాదారు జంబూల నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ యూనియన్‌ను బలోపేతం చేస్తానన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# బి.ఎస్సీ ఫార్మా గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు...

**జహీరాబాద్ సెప్టెంబర్ 28 (స్పందన)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్‌లో బి.ఎస్సీ ఫార్మాస్యూటికల్ (ఇంగ్లీష్ మీడియం) బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి ఎం.ఫార్మా అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ అస్లాం ఫారూఖీ తెలిపారు. జనరల్ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు తప్పనిసరి. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీతో పాటు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులతో టైప్ చేసిన దరఖాస్తును సెప్టెంబర్ 30న మధ్యాహ్నం 3 గంటల్లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీ సేవలు విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగుతాయని తెలిపారు.

# మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషిని కోల్పోవడం బాధాకరం టీజిఐడిసి మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్....

**జహీరాబాద్ సెప్టెంబర్ 28(స్పందన)**

మున్సిపల్ కాంట్రాక్టర్ విశ్వనాథన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ జహీరాబాద్ పట్టణంలోని స్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంత్రమ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 28(స్పందన)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు12 , నారాయణఖేడ్ డివిజన్‌కు 5,జహీరాబాద్ డివిజన్‌కు 5,అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని , కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్ ,మిషన్ భగీరథ గ్రిడ్, పోలీస్,సోషల్ వెల్ఫేర్ ,సర్వే ఢ ల్యాండ్ రికార్డు , మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పిసి బి,ఎల్ డిఏం,వైద్య ఆరోగ్య శాఖ .మునిసిపల్ శాఖలకు సంబందించిన పిర్యాదులు అందాయి . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఏఐ-ఆధారిత ఫార్మకోవిజిలెన్స్ పై శిక్షణ

## - ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం ఫార్మసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి

**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (స్పందన)**

ఫార్మాస్యూటికల్ భద్రత, నియంత్రణ వ్యవహారాలు, నియమపాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) యొక్క అభివృద్ధి చెందుతున్న అనువర్తనాలపై దృష్టి సారిస్తూ, మేక్ఇంటర్న్, ఇ-సెల్, ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు సెప్టెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఫార్మకోవిజిలెన్స్, ఫార్మాస్యూటికల్ క్వాలిటీ సిస్టమ్స్, రెగ్యులేటరీ సైన్స్ రంగాలలో పనిచేసే మహమ్మద్ హాషీమ్ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

'ఏఐ-ఆధారిత ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రతా విశ్లేషణలు', 'ప్రపంచ నియంత్రణ నిఘా, ఏఐ-ఆధారిత నియమపాలన' అనే రెండు కీలక అంశాలపై విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రత, నియంత్రిత నిఘా, ఫార్మాస్యూటికల్ నియమపాలనలో ఏఐ, డేటా-ఆధారిత సాంకేతికతల యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రపై విద్యార్థులకు ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నిపుణులతో నిర్వహించే ఈ శిక్షణ, పరిశ్రమ-ఆధారిత అభ్యాసం ద్వారా, సమకాలీన నియంత్రణ పద్ధతులపై విద్యార్థుల అవగాహనను పెంపొందించడం, వేగంగా మారుతున్న ఫార్మాస్యూటికల్, ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించిన నైపుణ్యాలను వారికి అందించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. విద్యను అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలతో అనుసంధానించడానికి, అలాగే ఫార్మాస్యూటికల్ సాంకేతికత, నియంత్రణ వ్యవహారాలు, ఏఐ-ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో విద్యార్థులలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి వీలు కల్పిస్తున్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమం, ఔషధ భద్రత, ప్రపంచ నియంత్రణ నియమపాలన, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రస్తుత పోకడలు, సాంకేతికతలు, ఆచరణాత్మక విధానాలతో మమేకమవ్వడానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ఐఐటీ నిపుణులతో ఒక అవకాశాన్ని అందిస్తోంది.

**మొబైల్ రోబోట్లపై గీతం విద్యార్థులకు శిక్షణ.....**

రోబోటిక్స్, ఆటోమేషన్ లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకు, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ హైదరాబాదులోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోట్లపై రెండు రోజుల స్వీయ అనుభవం గడించే కార్యశాలను విజయవంతంగా నిర్వహించింది. ఈ వర్క్‌షాపులో సుమారు 70 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ముఖాముఖి శిక్షణతో పాటు ఆచరణాత్మక ప్రదర్శనల ద్వారా విలువైన అనుభవాన్ని పొందారు. ఆసక్తికరమైన చర్చలు, ప్రశ్న-జవాబు కార్యక్రమాల ద్వారా, స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోటిక్స్ పై తమ అవగాహనను మరింత పెంచుకోవడానికి, అలాగే తమ సాంకేతిక సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ కార్యశాలలో పాల్గొనవారికి అవకాశం లభించింది.

వేగంగా అభివృద్ధి చెందుతున్న రోబోటిక్స్, ఆటోమేషన్ రంగంలో ఇది విలువైన అంతర్దృష్టులను అందించిందని పేర్కొంటూ, ఇందులో పాల్గొన్నవారు ఈ కార్యశాల యొక్క ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన విధానాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు తమ కెరీర్ అవకాశాలను విస్తృతం చేసుకోవడానికి, ఈ రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవడానికి సహాయపడతాయని కూడా వారు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, మెకానిక్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయప్రకాష్ శ్రీవాస్తవల పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. కిరణ్ కుమార్ ఈ కార్యశాలను సమన్వయం చేశారు.

# ఓటర్ హక్కు కాపాడాలి - రాజ్యాంగాని రక్షించాలి..

## ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఏకపక్ష ధోరణిని సహించం - నీలం మధు ముదిరాజ్

## ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలపై కాంగ్రెస్ నిరసన..

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా..

## జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ శ్రేణులు, ఉన్న నీలం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (స్పందన):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకలపై దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పట్టించుకోకుండా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి పట్టణ కేంద్రంలో ర్యాలీ, ధర్నాలో ఆయన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎంఎల్ఏ సంజీవ రెడ్డి, టీజిఐఐసి మాజీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన సమయంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే పరిశీలించాలని, పారదర్శక విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల నమ్మకాన్ని కాపాడే బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపుతో జరుగుతున్న నిరసనల్లో భాగంగా సంగారెడ్డిలో ఈ ధర్నా నిర్వహించామని నేతలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, టీపీసీసీ తోపాజీ అనంతకిషన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, మున్సిపల్ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

స్పందన తెలుగు దినపత్రిక

# భక్తి మార్గంలో నడుద్దాం...

## ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి,మాణికరావు

**భక్తిశ్రద్ధలతో లక్ష జప యజ్ఞం**

**జహీరాబాద్ సెప్టెంబర్ 28(స్పందన)**

ప్రతి ఒక్కరూ ఇతరులకు హాని కలిగించకుండా ధర్మమార్గంలో నడవాలని, గురువులు చూపిన సన్మార్గాన్ని అనుసరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో లోకకల్యాణం, రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన శత సహస్ర లక్ష జప యజ్ఞంలో పాల్గొన్నారు. ముందుగా వారికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, స్థానిక నాయకులతో కలిసి లక్ష జప యజ్ఞం లో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. మహా మంగళారతి నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ సుజిత విశ్వేశ్వర్, గ్రామ సర్పంచ్ రాజుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దొంగతనాల నివారణకు అప్రమత్తంగా ఉండాలి

**- గేటెడ్ కమ్యూనిటీల్లో భద్రత పటిష్టం చేసుకోవాలి**

**- బొల్లారం సీఐ సుధీర్ కుమార్**

**జిన్నారం, సెప్టెంబర్ 28(స్పందన) :**

రాత్రివేళల్లో జరిగే దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐడీఏ బొల్లారం సీఐ వి. సుధీర్ కుమార్ సూచించారు. సోమవారం గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు, ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందికి పోలీసులు అవగాహన కల్పించారు. దొంగలు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లు, తక్కువ భద్రత ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని సీఐ తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తూ గేట్లు, కాంపౌండ్ వాల్, పార్కింగ్ ప్రాంతాలను పర్యవేక్షించాలని సూచించారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవడంతో పాటు తగినంత లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వివరాలను నమోదు చేసుకుని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చోరీ ప్రయత్నాలు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే డయల్ 112కు లేదా ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ సుధీర్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# బ్లాస్టింగ్‌తో బెంబేలెత్తుతున్న మాదారం!

- స్టోన్ క్రషర్లపై గ్రామస్థుల ఫిర్యాదు.. ఇళ్లకు పగుళ్లు, పంటలకు నష్టం
- దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

**జిన్నారం, సెప్టెంబర్ 28(స్పందన) :**

బ్లాస్టింగ్ శబ్దాలు.. ప్రకంపనలతో ఇళ్లకు పగుళ్లు.. దుమ్ము, ధూళితో ప్రజలకు అవస్థలు.. పంట పొలాలపై దుమ్ము పేరుకుపోయి దిగుబడిపై ప్రభావం.. ఇదీ గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామ సమీపంలో నెలకొన్న పరిస్థితులని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 210లో నిర్వహిస్తున్న రాక్సాండ్, ఏఏఏ స్టోన్ క్రషర్ యూనిట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం.. క్రషర్ యూనిట్లలో రాత్రింబవళ్లు బ్లాస్టింగ్, రాళ్ల క్రషింగ్ కొనసాగుతుండటంతో భారీగా దుమ్ము, ధూళి వెలువడుతోంది. బ్లాస్టింగ్ సమయంలో వచ్చే ప్రకంపనలతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, పెద్ద శబ్దాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. క్రషర్ల నుంచి వెలువడే దుమ్ము సమీపంలోని వ్యవసాయ భూముల్లో పేరుకుపోవడంతో పంటలపై ప్రభావం పడుతోందని రైతులు వాపోయారు. క్రషర్ వాహనాల రాకపోకలతో రహదారులపై దుమ్ము విపరీతంగా లేస్తోందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా రాయల్టీ చెల్లింపుల విషయంలోనూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు.

**"సమగ్ర విచారణకు డిమాండ్"**

క్రషర్ యూనిట్ల నిర్వహణ, బ్లాస్టింగ్‌కు అనుమతులు, పర్యావరణ నిబంధనల అమలు, రాయల్టీ చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీతారం యాదవ్, మల్లేష్, కుమార్, భజరంగ్ సింగ్, నరసింహ, గణేష్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

# క్రీడలే క్రమశిక్షణకు పునాది

**విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**- జిన్నారంలో 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభం**

**జిన్నారం, సెప్టెంబర్ 28 ,(స్పందన):**

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతి వెలిగించి పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు.

**"క్రీడా మౌలిక వసతులకు ప్రాధాన్యం"**

పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి యువతకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని రూ.7 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వివిధ మండలాల్లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియాల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిషనర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మండల విద్యాధికారి విజయ్ కుమార్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కళింగ కృష్ణ కుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు

# నందారం నరసింహా గౌడ్ యువసేన ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా గణపతి శోభయాత్ర

**- బీరంగూడలో 26 లక్షలకు పలికిన గణేష్ లడ్డు**

**- లడ్డును దక్కించుకున్న నేరేడు గుంట సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ యాదవ్**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (స్పందన):**

అమీన్ పూర్ డివిజన్ బీరంగూడ వార్డు పరిధిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ యువసేన ఏర్పాటు చేసిన వినాయక మంటపం నిర్వాహకులు ఏర్పాటు చేసిన వేలంపాటలో 26 లక్షల పలికిన లడ్డు. నేరేడు గుంట సర్పంచ్ వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నాడు. అత్యంత వైభవంగా గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. ఆదివారం రాత్రి అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ యువసేన ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. నందారం నరసింహ గౌడ్ యువసేన ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట పోటాపోటీగా కొనసాగింది. నిజాంపేట గ్రామ సర్పంచ్ గణేష్ గణనాథుని లడ్డు వేలంపాటలో 26 లక్షలకు దక్కించుకొని, ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది లడ్డు వేలం పాటలో 25 లక్షలకు లడ్డును దక్కించుకున్నానని తెలిపారు. ఆ గణనాధుని యొక్క కృపతో గ్రామ సర్పంచిగా గెలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం కూడా వేలంపాటలో లడ్డును దక్కించుకోవడం, ఆ గణనాథుడి యొక్క కృప అని అన్నారు. అనంతరం నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ.... బీరంగూడలో గత 40 సంవత్సరాల నుండి ఆనవాయితీగా వస్తున్న గణనాథుడి సేవలో ఉంటూ.. వినాయక చవితి పండగ భారీ ఎత్తున నిర్వహిస్తున్నమన్నారు. గాయని మధుప్రియ బృందం రాజకుమార్ ఆలపించిన భక్తి పాటలకు భక్తులు మైమరిచిపోయారు. సదరు బృందం పాడిన పాటలు పలువురిని ఆకట్టుకోవడం విశేషం. వివిధ కళాకారులతో ప్రత్యేక ఆకర్షణగా బీరంగూడ ప్రాంతమంతా మారు మోగింది. ఈ కార్యక్రమంలో నందారం నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, భక్తులు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధికి తన సహకారం

**- రూ.1.80 కోట్లతో 33 దుకాణాలు**

**- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**జిన్నారం, సెప్టెంబర్ 28,(స్పందన) :**

జిన్నారం మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చే దిశగా మరో అడుగు పడింది. మున్సిపల్ కేంద్రంలో రూ. 1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33 దుకాణాల సముదాయానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. నూతన దుకాణాల నిర్మాణంతో మున్సిపాలిటీకి ప్రతి నెలా నిరంతర ఆదాయం సమకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. జిన్నారం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు రూ. 15 కోట్లతో ప్రతి వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన పాలన సాధ్యమవుతుందని అన్నారు. జిన్నారం మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిషనర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 22ఏ జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి

**- ప్రజావాణిలో అనంతారం ప్రజాప్రతినిధుల వినతి**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 28(స్పందన):**

అనంతారం పరిధిలోని చట్టబద్ధమైన పట్టా భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు హక్కులు కల్పించాలని అనంతారం సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి కోరారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చడంతో యజమానులు చట్టబద్ధమైన భూ లావాదేవీలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా భూములకు ప్రభుత్వ కేటాయింపు రికార్డులు, ఆర్డీవో అనుమతులు, నిరభ్యంతర పత్రాలు, రిజిస్టర్డ్ విక్రయ పత్రాలు, హక్కు పత్రాలు ఉన్నాయని వివరించారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి, భూ యజమానులు తమ హక్కులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందన
తెలుగు దినపత్రిక

## 20 ఏళ్లకే వరుస సినిమాలు..

టాలీవుడ్‌లో కొత్త హీరోయిన్ల ఎంట్రీ ఎప్పటికప్పుడు పెరుగుతోంది. కొందరు అందంతో ఆకట్టుకుంటే.. మరికొందరు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ గుర్తింపు తెచ్చు కుంటున్నారు. ముఖ్యంగా చాలా చిన్న వయసులోనే కథానాయికలుగా పరిచయమవుతున్న నటీమణుల సంఖ్య పెరుగుతోంది. కృతి శెట్టి, శ్రీలీల వంటి యంగ్ హీరోయిన్ల తర్వాత ఇప్పుడు మరో నటి వరుస సినిమాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమెనే అననతిక సునీల్ కుమార్. అననతిక సునీల్ కుమార్ 'మ్యాడ్' సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. తొలి చిత్రంలోనే తన నటన, సహజమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. పెద్దగా సినీ అనుభవం లేకపోయినా తెరపై ఎంతో సహజంగా కనిపిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. 'మ్యాడ్' తర్వాత అననతికకు వరుస అవకాశాలు వచ్చాయి. తమిళంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన 'లాల్ సలామ్'లోనూ కనిపించింది. ఇటీవల 'రోమాంచకం' సినిమాలో నటించగా.. 'పరిమళ్ అండ్ కో'తోనూ ప్రేక్షకులను పలక రించింది.

## ఓటీటీలోకి వచ్చినా 'ఇరుముడి' జోరు తగ్గలేదే!

సినిమా ఓటీటీలోకి వచ్చిందంటే సాధారణంగా థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతుంది. కానీ మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' మాత్రం ఈ ట్రెండ్‌కు భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో విడుదలై 38 రోజులు పూర్తయినప్పటికీ.. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమై పది రోజులు దాటినా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని థియేటర్లలో ప్రేక్షకుల స్పందన కొనసాగుతున్నట్లు చిత్రబృందం, వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. హిందూపురంలోని ఎస్వీ సినిమాక్స్‌లో 'ఇరుముడి'కు వచ్చిన స్పందన ఇందుకు ఉదాహరణగా నిలిచింది. సినిమా విడుదలై 38 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఆదివారం తొలి ఆటకు కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చినట్లు సమాచారం. ఓటీటీలో అందుబాటులో ఉన్నప్పటికీ థియేటర్‌కు వచ్చి సినిమా చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపడంతో ఆ షోకు హౌస్‌ఫుల్ బోర్డు పడినట్లు తెలుస్తోంది.

## త్వరలో చిరంజీవి కొత్త ప్రయోగం?

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ఆయన.. ఇప్పుడు డిజిటల్ వేదికపై సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ కోసం చిరంజీవి ఓ ప్రత్యేక కార్యక్రమం చేయనున్నారనే వార్తలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. చిరంజీవి ప్రధానంగా సినిమాల్లోనే కనిపిస్తుంటారు. అయితే ఈసారి సినిమాకు భిన్నంగా ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు వ్యాఖ్యాతగా వ్యవహ రించనున్నట్లు సమాచారం. తొలుత చిరంజీవితో ఓ డాక్యుమెంటరీ రూపొందించాలనే ఆలోచన తో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కథనాలు చెబుతున్నాయి.

## రకుల్ ప్రీత్‌సింగ్‌కు షాక్..

బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రదేశాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహిస్తోంది. ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నట్లు పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. సినిమాల నిర్మాణం, ఫైనాన్సింగ్‌కు సంబంధించిన నిధుల లావాదేవీలపై అనుమానాల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో నిధులను విదేశాలకు తరలించినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముంబై ఆదాయపు పన్ను శాఖకు చెందిన బృందాలు పలు ప్రాంతాల్లో పత్రాలు, ఆర్థిక రికార్డులు, విదేశీ లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు సోదాల్లో ఎలాంటి అక్రమాలు బయటపడ్డాయనే విషయంపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కోలీవుడ్‌లో బిజీ.. బిజీ

యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా మారారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2026లోనే ఆమె నటించిన 'ఫంకీ', 'హృదయం మురళి', 'పల్లీ చట్టాంబి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్', 'ది ప్యారడైజ్' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఒకే ఏడాదిలో ఆరు సినిమాలు విడుదల కావడం ఆమె కెరీర్‌లో ఉన్న వేగాన్ని తెలియజేస్తోం ది. ఫలితాలతో సంబంధం లేకుండా అవకాశాలు ఇప్పటివరకు కయాదు నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో వాణిజ్య విజయాన్ని అందుకోకపోయినా.. ఆమెకు వస్తున్న అవకాశాలపై మాత్రం పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దర్శకులు, నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోలీవుడ్ స్టార్ హీరోలతో ఛాన్సులు ం కయాదు లోహర్ తమిళ చిత్రసీమలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉ న్నారు.

## రాజమౌళి-సూర్య కాంబో

**దర్శకధీరుడు** ఎస్.ఎస్. రాజమౌళి, తమిళ స్టార్ హీరో సూర్య కాంబినేషన్‌పై చాలా కాలంగా ఆసక్తి నెలకొంది. వీరిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారంటూ ఎప్పటికప్పుడు వార్తలు వస్తున్నా.. ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. తాజాగా చెన్నైలో జరిగిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కార్యక్రమంలో రాజమౌళికి ఇదే అంశంపై ప్రశ్న ఎదురైంది. ప్రశ్నకు రాజమౌళి సరదా సమాధానంకార్యక్రమంలో యాంకర్ సూర్యతో సినిమా చేసే అంశంపై ప్రశ్నించగా.. ఈ ప్రశ్న తనకు వస్తుందని ముందే ఊహించానని రాజమౌళి సరదాగా చెప్పారు. అయితే ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. తాను ఇప్పుడు ఏదైనా పెద్ద విషయాన్ని బయటపెడితే.. అసలు కార్యక్రమం కంటే ఆ విషయమే ప్రధాన చర్చగా మారిపోతుందని అన్నారు. 'స్పెషల్‌గా ఉ ంటుంది' అంటూ క్లూ అయితే రాజమౌళి అభిమానుల ఆసక్తిని మరింత పెంచేలా ఓ చిన్న క్లూ ఇచ్చారు. భవిష్యత్తులో తాను, సూర్య కలిసి సినిమా చేస్తే మాత్రం అది ప్రత్యేకంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ముందు వరుసలో కూర్చున్న సూర్య నవ్వుతూ స్పందించడం అభిమానులను ఆకట్టుకుంది. మళ్లీ ఊపందుకున్న చర్చరాజమౌళి-సూర్య కాంబినేషన్‌పై గతంలోనూ ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటిపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. తాజాగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలతో ఈ కాంబినేషన్‌పై చర్చ మరోసారి ఊపందుకుంది. ప్రస్తుతం రాజమౌళి తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించగా.. సూర్య కూడా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. వీరిద్దరి కలయిక ఎప్పుడు సాధ్యమవుతుందనే దానిపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780